**చూడటానికి సాదాసీదాగానే కనిపిస్తాడు** కానీ ఆంగ్లంలో ఆయన మాట్లాడితే చాలు... మందార తోటలో మకరందంలా కమ్మదనాన్ని కలిగిస్తుంది.. ఒక్క క్షణంలోనే ఆయన ఆంగ్ల పదాల పలుకు ఎదుటి వారిని ఇట్టే ఆకట్టుకుంటుంది.. బ్లాక్ బోర్డుపై ఇంగ్లీషు అక్షరాలు రాసి స్పోకెన్ ఇంగ్లీష్ పాఠం బోధిస్తుంటే చాలు. చిరుగాలి సితారా సంగీతంలా తరగతి గదిలోని విద్యార్థుల మనసును కట్టిపడేస్తుంది.. ఒక పదం వెంట మరో పదం ఆంగ్లంలో ఆయన మాట్లాడుతు న్నప్పుడు ఆయన నోటి నుండి వచ్చే ఆంగ్ల పదాల పొందిక తరగతి గదిలో స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్ వింటున్న వారిని మంత్ర ముగ్ధులను చేస్తుంది.. అందుకే అత్యంత కష్టమని భావించే ఇంగ్లీషును ఇంత సులువుగా మాట్లాడవచ్చా అనేలా ఆయన చెప్పే పాఠాలు ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు అనతికాలంలోనే అత్యంత చేరువ చేశాయి. ఒక్క మాటలో చెప్పాలంటే స్పోకెన్ ఇంగ్లీష్‌లో తిరుగులేని ప్రభంజనం సృష్టిస్తూ తన కంటూ ఒక ప్రత్యేకతను చాటుకుంటున్నాడు.. అత్యంత పేద కుటుంబంలో పుట్టి.. అనేక కష్టాలు ఎదుర్కొని అడ్డాకూలీగా పనిచేసి నేడు ఆంగ్ల విజ్ఞాన మహర్షిలా వేనోళ్లా కీర్తి గడిస్తున్న ఆయనెవరో కాదు.. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ముస్టికుంట్ల గ్రామానికి చెందిన **ప్రముఖ స్పోకెన్ ఇంగ్లీష్ మాస్టర్ కేవీ నారాయణ్.**

వనం నాగయ్య,
కెరటం న్యూస్



# సరిలేరు నీకెవ్వరు

## కె.వి నారాయణ్

- స్పోకెన్ ఇంగ్లీష్‌లో తిరుగులేని ప్రస్థానం
- కదిలే కాలంతో పోటీపడి గెలిచిన ధీశాలి
- 2007లో కెవిఎస్ ఇన్స్టిట్యూట్‌కు అంకురార్పణ
- ఒకేసారి మూడు బోర్డులపై బోధించడంలో దిట్ట..
- ఖమ్మం జిల్లాలో ఆయన ఓ ప్రభంజనం
- దేశ, విదేశాల్లోనూ ఆయనకు విద్యార్థులే..
- స్పోకెన్ ఇంగ్లీష్‌లో ఒక బ్రాండ్‌లా సాగుతున్న కేవీ ప్రస్థానం..



### ఇదీ కేవీ నారాయణ్ ప్రస్థానం..

మనిషై పుట్టినవాడు కారాదు మట్టి బొమ్మ..పట్టుదలే ఉంటే కాగలడు మరో బ్రహ్మ.. కృషి ఉంటే మనుషులు రుషులౌతారు..మహాపురుషులౌతారు..తరతరాలకు తరగని వెలుగౌతారు..ఇలవేలుపులౌతారు..అని దిగ్గజ కవి వేటూరి రాసిన అక్షరాల్లోని ప్రతీ అక్షరాన్ని పరికించి చూసే అడుగడుగునా మనకు కేవీ నారాయణ్ జీవితం ఆవిష్కారం అవుతుంది. కూలి పనికి వెళితేనే పూటగడిచే ఇంట్లో పుట్టిన కామిశెట్టి వెంకటనారాయణ తల్లిదండ్రుల కు ముగ్గురు (శ్రీనివాసరావు, వెంకటరమణ, వెంకటనా రాయణ) సంతానం. ఆస్తులు లేవు..అంతస్తులూ లేవు.. సరికదా అందరి మాదిరిగానే ఇంట్లో చిన్నవాడైనా ఆదర్శంలో పెద్దవాడిలా ఆలోచించే కేవీ నారాయణ్ పదో తరగతి వరకూ స్థానిక ముస్టికుంట్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యను పూర్తిచేశాడు. ఇంటర్(హెచ్ ఈసీ) తెలుగు మీడియంలో నాగులవంచలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ, బీఏ డిగ్రీని ఖమ్మం సిద్ధారెడ్డి కాలేజీలో పూర్తిచేశాడు. బీఈడీలో నాడు ఉమ్మడి ఏపీలోనే అత్యుత్తమ ర్యాంకు సాధించి ఔరా అనిపించాడు. పేద కుటుంబంలో పుట్టి తల్లిదండ్రుల కష్టాలు కండ్లారా చూసిన కేవీ నారాయణ్ చిన్న నాటినుండే తల్లిదండ్రుల శ్రమకు తోడుగా ప్రతీ శని, ఆదివారాల్లో కూలిపనులకు వెళ్లి వచ్చే డబ్బుతో ఎంతో కొంత కుటుంబానికి ఆసరాగా ఉండాలని పరితపించేవాడు. కష్టాలు ఎన్ని పలకరిస్తున్నా చలించకుండా తాను ఏదో ఒకటి సాధించాలన్న ఆశయంతో ముందు చూపుతో అడుగేసేవాడు. తనలోని పట్టుదలకు తోడు స్వయం కృషితో ఒక్కో మెట్టూ ఎక్కుతూ నాడు అడ్డాకూలీగా, హమాలీ మేస్త్రీగా పనిచేసిన కేవీ నారాయణ్ నేడు ఆంగ్లంలో పట్టు సాధించి స్పోకెన్ ఇంగ్లీష్‌లో రాణిస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లా మెడలో వజ్రంలా మెరుస్తున్నాడు. ఆంగ్ల భాషపై





పట్టు సాధించాలనుకునే వారికి దిక్సూచీలా, కేరాఫ్ అడ్రస్‌లా మారి తిరుగులేని జైత్ర యాత్ర కొనసాగిస్తున్నాడు.

**ఖండాంతరాలకు చేరుకున్న ఖ్యాతి..**

స్పోకెన్ ఇంగ్లీష్ పాఠం బోధిస్తుంటే కేవీ నారాయణ్ నోట నుండి వచ్చే ప్రతీ పదం, పలుకూ ఉషోదయాన వీచే సుప్రభాత పరిమళంలా ఎదుటివారి మనసుకు హాయి గొలుపుతుందని ఆయన క్లాస్ విన్న వారు అంటారు. అందుకేనేమో అనతికాలంలోనే కేవీ నారాయణ్ అందరికీ సుపరిచితుడయ్యాడు. ఒక్క మాటలో చెప్పాలంటే ఖమ్మం తో పాటు చుట్టుపక్కల జిల్లాల్లోని అనేక మంది ప్రముఖులైన వారు ఇంగ్లీష్‌లో పట్టు సాధించడానికి ఇతని క్లాసులకు హాజరవుతుంటారు. ప్రస్తుతం యూకే. యూఎస్ఏ లాంటి ప్రాంతరాలకు వెళ్లిన తెలుగు విద్యార్థులు సైతం ఆన్‌లైన్‌లో కేవీ నారాయణ్ క్లాసులు వింటూ వారి విజ్ఞానాన్ని ఆంగ్లలో మరింత పెంచుకుంటున్నారంటే అతిశయోక్తి కాదు. ఇంతింతై వటుదింతై అన్నట్టుగా స్పోకెన్ ఇంగ్లీష్ లో ప్రత్యేక గుర్తింపుతో సాగుతున్న కేవీ నారాయణ్ ప్రస్థానం నిజంగా ఒక ప్రభంజ నమేనని చెప్పాలి. ఎందు కంటే తాను చదివింది అంతా తెలుగు మీడియంలో, అందులోనూ అత్యంత సాధారణ కోర్సులు పూర్తిచేసి అకుంఠిత దీక్ష, పట్టుదల, ఏకాగ్రత ముందు ఒక ఉన్నత లక్ష్యం తలవంచింది. అయిన వారు.. ఆత్మీయులు, కొందరు స్నేహితులు సైతం కేవీ నారాయణ్‌ను ఒకప్పుడు చాలా చులకన భావంతో చూసిన వారికి నేడు తనేంటో నిరూపించుకుని స్పోకెన్ ఇంగ్లీష్‌లో రారాజులా కీర్తి గడిస్తున్నాడు. ఏదీ తనంతట తాను నీ దరికి రాదు శోధించి సాధించాలన్న ఒక మహాత్ముడి మాటలే కేవీ నారాయణ్‌కు స్ఫూర్తిని రగిలించాయి. ఫలితంగా అనుకున్నది సాధించి చూపించాడు. ఇప్పుడు స్పోకెన్ ఇంగ్లీష్‌కు కేరాఫ్ అడ్రస్‌లా మారిపోయాడు.

2007లో కేవీఎస్ ఇన్స్టిట్యూట్‌కు అంకురార్పణ చేసిన నారాయణ గతంలో ఎన్నడూ లేనివిధంగా కమ్యూనికేషన్ స్కిల్స్ బోధన విషయంలో మొట్టమొదటిసారిగా మూడు బోర్డులను ఉపయోగించి బోధించి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. మూడు బోర్డులను ఉపయోగించి బోధించడం ద్వారా తక్కువ కాలంలో ఎక్కువ నైపుణ్యాలను బోధించే అవకాశం కలుగుతుంది. సరళమైన పద్ధతిలో ఇంగ్లీషులో సులువుగా నేర్చుకునే మెలకువలు ఆయనలోని ప్రత్యేకతను

## 2007లో కేవీఎస్ ఇన్స్టిట్యూట్‌కు అంకురార్పణ

గుర్తుకు వస్తాయి. విదేశాలకు వెళ్లే విద్యార్థులకు ఐఈఎల్‌టీఎస్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వటం జరుగుతుంది. తెలుగు రాష్ట్రాల నుంచి విదేశాలకు వెళ్లి స్థిరపడిన ఉద్యోగస్తులు మరియు విద్యార్థుల కు ప్రత్యేకంగా ఆన్‌లైన్ క్లాసెస్ తీసుకోవడం జరుగుతుంది. పేద విద్యార్థులకు ప్రతి బ్యాచ్‌లో ఇద్దరికీ ఫ్రీ అడ్మిషన్ కల్పించడం జరుగుతుంది. ఉదయం 6 గంటల నుండి ఉ.7:30 వరకూ, సాయంత్రం 6 గంటల నుండి 7:30 వరకూ.. టీచర్స్, లెక్చరర్స్, ఇతర ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేక బ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. నేర్చుకునే వారిలో టీచర్లు, లెక్చరర్లు, ఉద్యోగస్తులే ఎక్కువ ఉండటం విశేషం.

**కదిలే కాలాన్ని, జ్ఞానాన్ని ఒడిసిపట్టిన నేర్పరి..**

చదివింది అంతా తెలుగు మీడియంలోనే అయినా ఆంగ్లంలో ఇంత పట్టు సాధించడానికి కేవీ నారాయణ్ అవిశ్రాంతంగా శ్రమించాడు. కదిలే కాలాన్ని ఒడిసి పట్టాడు. 'చిన్న లక్ష్యం ఒక పెద్ద నేరం..' అని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పినట్టుగా నారా యణ్ ఆంగ్లంలో పట్టు సాధించాలన్న పెద్ద లక్ష్యం ఎంచుకుని విజయం సాధించాడు. అందుకు 2011లో తొలి అడుగు పడింది. డిస్టెన్స్‌లో ఎంఏ ఇంగ్లీష్ (పీజీ) చేసిన నారాయణ్ నిరంతర సాధనతో ఆంగ్లంపై ఉన్న మక్కువ, తపనతో పట్టు సాధించాడు. స్వతహాగా ఇంగ్లీష్ పదాలను ఆలవోకగా, వినడానికి హాయి గొలిపేలా ఇంగ్లీషు పదాలు పలికే నారాయణ్ అనకు అందనంత దూరంలో ఉన్న ఇంగ్లీషులో తిరుగులేని పట్టు సాధించి కదిలే కాలాన్ని, జ్ఞానాన్ని ఒడిసిపట్టాడు. అక్కడి నుండి పలు ప్రయివేటు స్కూళ్లలో ఇంగ్లీషు మాస్టారుగా ఆంగ్లం బోధిస్తూ తనలోని విజ్ఞానాన్ని ఖమ్మం నలుదిశలా చాటి తనేంటో తన సత్తా ఏంటో నిరూపించు కున్నాడు. అంతే కొద్ది కాలంలోనే ఎందరో కేవీ నారాయణ్‌ను గుర్తించేలా కష్టపడ్డాడు. ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులు, పోటీ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు సహా, విదేశాలకు వెళ్లేందుకు సిద్ధపడుతున్న విద్యార్థులు సైతం నారాయణ్ దగ్గర స్పోకెన్ ఇంగ్లీష్ లో తర్ఫీదు పొంది పట్టు సాధిస్తూ వారి వారి రంగాల్లో విజేతలుగా వెలుగులు పంచుతున్నారు. అందుకే ఆంగ్లంలో విజ్ఞాన మహర్షిలా కీర్తి గడించి ఒక ప్రభంజనంలా మారాడు.

**ఇప్పుడు ఖమ్మంలో ఆయన ఓ బ్రాండ్..**

సొంతిల్లే తరగతి గదిలా మార్చివేసి.. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ స్పోకెన్ ఇంగ్లీష్‌లో ప్రత్యేక గుర్తింపుతో రాణిస్తూ, వివిధ ప్రయివేటు కాలేజీల్లో ఇంగ్లీష్ అధ్యాపకునిలా, కార్పొరేట్ స్కూళ్లలో ఇంగ్లీష్ ఉపాధ్యాయునిలా రాణిస్తున్న కేవీ నారాయణ్ ఇప్పుడు ఖమ్మంలో ఒక బ్రాండ్‌లా వెలుగుతున్నాడు. తన సతీమణి ఉషాకుమారి ప్రస్తుతం నర్సింహుల పేట మోడల్ స్కూల్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. కేవీ నారాయణ్, ఉషాకుమారి దంపతులకు గ్రీష్మనారాయణ్, శైలి నారాయణ్ అనే ఇద్దరు ముద్దుల కూతుళ్లున్నారు. అతను కష్టాల్లో ఉన్నప్పుడు తన లక్ష్యం కోసం అవిశ్రాంతంగా పోరాటం చేస్తున్నప్పుడు తనకు అండగా నిలిచిన తన అత్తామామలు పసుపులేటి కోటేశ్వరరావు, అరుణ ప్రోత్సాహం ఎన్నటికీ మరువలేనని వారిని కేవీ నారాయణ్ నిత్యం గుర్తుచేసుకుంటారు. కేవలం డబ్బుకోసమే తన జ్ఞానం పంచకూడదన్న పవిత్ర ఆశయంతో ఎందరో పేద కుటుంబాల విద్యార్థులకు ఉచితంగానే స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పిస్తూ, మరెందరో ఉన్నత చదువుల్లో ఉన్న వారికి ఆంగ్లంలో పట్టు కల్పిస్తూ..తను, తన సతీమణి కష్టపడి సంపాదించిన డబ్బుతో ఎందరికో దానధర్మాలు, ఆర్థిక సాయం చేస్తూ వారిలోని మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ఎంత ఎదిగినా అంతలా ఒదిగి ఉండే కేవీ నారాయణ్ ప్రస్తుతం ఖమ్మంలో ఒక బ్రాండ్‌లా గుర్తింపు తెచ్చుకున్నా..తను కష్టపడి ఎదిగిన క్షణాలు ఏ ఒక్క రోజు కూడా మర్చి పోలేదు. ఒక మంచి ఆశయంతో మరింత పెద్ద లక్ష్యంవైపు అలుపెరగని బాటసారిలా అడుగులు వేస్తున్నారు.



